క్లుప్తంగా

కోలుకుంటున్న డయేరియా బాధితులు


బాధితులను పరిశీలిస్తున్న వైద్యులు

వెలుగోడు: గుంతకందాల గ్రామంలో డయేరియా బాధితులు కోలుకుంటున్నారు. గ్రామంలో రెండు రోజులుగా డయేరియాతో స్థానికులు అస్వస్థతకు గురయ్యారు. మొదటి రోజు 8 మంది విరేచనాలతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరగా, మరో 11 మంది అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం వీరిలో 13 మంది కోలుకోవడతో డిశ్చార్జ్ చేశారు. ఇక వెలుగోడు పీహెచ్‌సీలో ఐదుగురు, నంద్యాల ఆసుపత్రిలో నలుగురు చికిత్స పొందుతున్నారు. కాగా..వుడ్‌సేఫ్టీ అధికారులు గ్రామంలో పర్యటించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో నీటి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. వేల్పనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో డాక్టర్ వంశీకష్ణ ఆధ్వర్యంలో శిబిరం కొనసాగిస్తున్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

మిడుతూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సలీం బాషా తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తీర్ణత, మార్కుల ఆధారంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీలు రూ. 200, ఎస్సీ, ఎస్టీ రూ.150 చెల్లించాలని, జూన్ 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు.

కొలనుభారతిలో భక్తుల పూజలు


చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని కొలనుభారతి క్షేత్రంలో భక్తులు విశేషపూజలు చేశారు. శుక్రవారం సప్తమి కావడంతో సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సరస్వతీ దేవికి కుంకుమార్చన, పుష్పార్చన, అభిషేకాది కార్యక్రమాలు, మంగళహారతి తదితర పూజలు చేపట్టారు. అలాగే సప్తశివాలయాల్లోని దేవతామూర్తులకు పూజలు చేశారు. క్షేత్ర ప్రాంగణంలో సప్తమిని పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ చిన్నారులకు ఆలయ పురోహితులు బీజాక్షరాలు దిద్దించి అక్షరాభ్యాసం చేయించారు.

నాటుసారా స్వాధీనం


నీలిషికారి పేటలో బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

నందికొట్కూరు: పట్టణంలోని నీలిషికారిపేటలో టౌన్ సీఐ విజయభాస్కర్, ఎస్‌ఐలు ఎన్వీ రమణ, ఓబులేసు, మారుతీ శంకర్, వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో శుక్రవారం 250 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, ఎనిమిది మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. సీఐ మాట్లాడుతూ నాటుసారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

దుంగల అక్రమ రవాణాపై ఆరా

మహానంది: మహానంది–గాజులపల్లె మార్గంలోని జీనశంకర తపోవనం సమీపంలోని నల్లమల అడవిలో తైలంచెట్లను నరికి దుంగలను అక్రమంగా తరలించిన విషయంపై అటవీశాఖ ఉన్నతాధికారులు ఆరా తీశారు. ఈ మేరకు డీఎఫ్ఓ వినీత్‌కుమార్, ఎఫ్ఆర్ఓ శివన్న ఆదేశాల మేరకు మహానంది డీఆర్ఓ సుబ్బయ్య విచారణ చేపట్టారు. 23 దుంగలను మహానంది పర్యావరణ కేంద్రానికి తరలించి శుక్రవారం సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించినట్లు చెప్పారు. నరికిన, మిగిలి ఉన్న చెట్లకు నంబరింగ్ ఇచ్చారు. ఇందులో మహానంది, శిరివెళ్ల మండలాలకు చెందిన కొందరి హస్తం ఉన్నట్లు సమాచారం.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

మహానంది: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠినచర్యలు తీసుకుంటామని మహానంది ఎస్‌ఐ జి.నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం రాత్రి బహిరంగంగా మద్యం సేవిస్తున్న నలుగురిపై కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే..వాహనాల తనిఖీ చేపట్టి, ధ్రువపత్రాలు లేని పలువురికి జరిమానాలు విధించినట్లు చెప్పారు.

నిషేధాన్ని నదిలో వదిలేశారు!

- కృష్ణానదిలో బోటు ప్రయాణాన్ని నిషేధించిన అధికారులు
- మూర్వకొండ ఘాట్‌ను మూయించిన ఎస్‌ఐ
- అర్లపాడు ఘాట్ నుంచి యథేచ్ఛగా కొనసాగుతున్న ప్రయాణాలు


అర్లపాడు ఘాట్ వద్ద ప్రయాణికుల రద్దీ

పగిద్యాల: ఇటీవల అవుకులో జరిగిన కొన్ని బోటు ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు కృష్ణానదిలో బోటు ప్రయాణాన్ని నిషేధించారు. ఈ మేరకు పోలీసులు మూర్వకొండ ఘాట్‌ను ముయించారు. అయితే ఆర్లపాడు ఘటు నుంచి బోట్లు నడుస్తుండటంతో ప్రయాణికుల తాకిడి ఎక్కువయ్యింది. కాగా నిషేధం మూర్వకొండ ఘాట్‌కేనా, ఆర్లపాడుకు లేదా అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తెలంగాణతో విడదీయలేని బంధం..

రాయలసీమ ప్రాంత ప్రజలకు తెలంగాణ ప్రాంతంతో వీడదీయలేని అనుబంధం ఉంది. ఇక్కడి పిల్లలను అక్కడికి, అక్కడి పిల్లలను ఇక్కడికి ఇచ్చి పుచ్చుకోవడం వలన బాంధవ్యాలు పెనవేసుకుపోయాయి. వీరి బాంధవ్యాలకు కృష్ణానది వారధిగా నిలిచింది. అందుకే ఎక్కువ శాతం ప్రజలు కృష్ణానది మీదనే ప్రయాణాలను కొనసాగిస్తున్నారు. ఇందకు మూర్వకొండ ఘాట్, అర్లపాడు ఘాట్‌లు వేదికగా మారాయి. నది అవతల ఉన్న తెలంగాణ ప్రాంతానికి రోడ్డు మార్గాన వెళ్లాలంటే సుమారు 150కిలో మీటర్లు చుట్టూ తిరిగిరావాల్సి వస్తుంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు అనాదిగా ఘాట్ ప్రయాణాన్నే ఎక్కువగా ఆశ్రయించడం వలన ఈ రెండు ఘాట్‌లు ప్రతి రోజూ ప్రయాణికుల సందడితో కళకళలాడుతాయి.

జటప్రోలు దేవర నేపథ్యంలో పోటెత్తిన ప్రయాణికులు

కొద్ది రోజుల క్రితం అవుకు రిజర్వాయర్‌లో చోటుచేసుకున్న బోటు ప్రమాదం ఎఫెక్ట్ మూర్వకొండ ఘాట్‌పై పడింది. ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగార్జున, నందికొట్కూరు రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి మూర్వకొండ ఘాట్‌ను సందర్శించి ఇంజన్ బోటు ప్రయాణంపై నిషేధం విధించారు. అంతేకాకుండా మూర్వకొండ ఘాట్ నిర్వాహకులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. మూర్వకొండ ఘాట్‌ను బంద్ చేయించడంతో అర్లపాడు ఘాట్‌కు ప్రయాణీకుల తాకిడి అధికమైంది. తెలంగాణ ప్రాంతంలో జట్‌ప్రోలు దేవర ఉండటంతో అర్లపాడు ఘాట్‌కు ప్రయాణికులు పోటెత్తుతున్నారు. వందలాది మంది ఇక్కడి నుంచి బయలుదేరివెళ్తడం విశేషం. నిషేధం ఒక్క మూర్వకొండ ఘాట్‌కేనా.. అర్లపాడు ఘాట్‌కు వర్తించదా అంటూ సందేహాలను వ్యక్తం చేస్తున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

ఇటీవల ఘాట్ నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చాం. బోట్లను స్వాధీనం చేసుకొని స్టేషన్‌లో తెచ్చి పెట్టుకున్నాం. మళ్లీ ఏ విధంగా బోట్లు నడుపున్నారు. అయినా విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– నాగార్జున, ఎస్‌ఐ, ముచ్చుమర్రి

రాయలసీమకు నీళ్లు, నిధులివ్వాలి

జూపాడుబంగ్లా: రాయలసీమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే సాగు,తాగునీళ్లు, అభివృద్ధికి అవసరమైన నిధులు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. మండ్లెం గ్రామంలో సాగు భూములకు నీరివ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన జలదీక్ష కార్యక్రమానికి శుక్రవారం మద్దతు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గం చుట్టూ శ్రీశైలం బ్యాక్‌వాటర్ ఉన్నా సాగు, తాగునీరు లభించని దుస్థితి నెలకొందని చెప్పారు.

శివతత్వంపై ప్రవచనం


ప్రవచనాలను వినిపిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణమాఢవీధిలోని నిత్యకళావేదికపై జిల్లుళ్ళమూడికి చెందిన వి.గణేష్ శివ తత్వంపై ప్రవచనాలను వినిపించారు. భక్తులు ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు.

వలంటీర్లు.. సంక్షేమ సారథులు


వలంటీర్లను సన్మానించిన దృశ్యం


వలంటీర్ గంగావతిని సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


వలంటీర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నందికొట్కూరు రూరల్ : ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న వలంటీర్లు సంక్షేమ సారథులు అని మల్యాల సర్పంచి ఉమాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని మల్యాల గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వలంటీర్లకు అవార్డులు అందజేశారు. ఎంపీడీఓ శోభారాణి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: వలంటీర్లు సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేస్తున్నారని ఎంపీడీఓ మంజులవాణి, ఎంపీపీ సువర్ణమ్మ, వైస్ ఎంపీపీ రమణమ్మ, ఈఓపీఈఆర్డీ మణిమంజరి, సర్పంచులు లక్ష్మిదేవమ్మ, ఈశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో తాటిపాడు, తంగడంచ గ్రామాల వలంటీర్లను సన్మానించారు. తాటిపాడులో 21మందిలో 17మందికి, తంగడంచలో 12 మందిలో 11మందికి పురస్కారాలు లభించినట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యదర్శులు శాంతయ్య, విజయ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

నందికొట్కూరు: సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందిస్తున్న వలంటీర్లు సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో 10 సచివాలయాల వలంటీర్లకు ఉత్తమ సేవ అవార్డులు మున్సిపల్ చైర్మన్, ఆర్ఓ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు సుమలత, నాయబ్, లాలు ప్రసాద్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వలంటీర్లు కృషి మరవలేనిదని చెప్పారు. 254 మంది వలంటీర్లకు గాను 207మంది అవార్డులకు ఎంపికయ్యారన్నారు. సేవా వజ్రకు ఒకరు, సేవా రత్నకు ఐదుగురు, సేవా మిత్రకు 201 మంది వలంటీర్లను ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు.సచివాలయ ఉద్యోగులు,నాయకులు ఉస్మాన్‌బేగ్, శాలిబాషా, ఆర్ట్ శ్రీను పాల్గొన్నారు.

మిడుతూరు: వలంటీర్లు జగనన్న సైన్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని తిమ్మాపురం గ్రామ సర్పంచ్ నాగస్వామిరెడ్డి, చెరుకుచెర్ల గ్రామ సర్పంచ్ మరియమ్మ తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు తిమ్మాపురంలో, సాయంత్రం చెరుకుచెర్ల గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు షఫీఅహమ్మద్ , ఫరీద్ బాషా పాల్గొన్నారు.

కొత్తపల్లి: వలంటీర్లు ప్రజాసేవకులని సర్పంచు షేక్ నాజియా అన్నారు. శుక్రవారం మండలంలోని ఎదురుపాడు, కొక్కెరంచ గ్రామ సచివాలయాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వలంటీర్లను ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శులు పార్థసారథి,నాగరాజు పాల్గొన్నారు.

పాములపాడు: వలంటీర్ల సేవలు అద్భుతమని వార్డు సభ్యుడు రాజన్న అన్నారు. శుక్రవారం మండలంలోని యర్రగూడరు గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. సేవా రత్న అవార్డు గ్రహీత కతంరమయ్య, ఇతర వలంటీర్లను సత్కరించారు. పంచాయతీ కార్యదర్శి జీవన్ పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ


పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. వేదపండితు లు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి,అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి స్థానిక అలంకార మండపంలో అలంకారపూజ, అలంకార హారతులు శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం గోమాతకు విశేష పూజలు చేపట్టి ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాంరంలో ఊరేగించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, భక్తులు పాల్గొన్నారు.

సస్యరక్షణలో మెళకువలు పాటించాలి


పత్తిలో యాజమాన్య పద్ధతులను వివరిస్తున్న డాక్టర్ రామకృష్ణారావు

మిడుతూరు: సస్యరక్షణలో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని నంద్యాల జిల్లా ఏరువాక కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ ఏ.రామకృష్ణారావు తెలిపారు. శుక్రవారం మిడుతూరుతో పాటు జలకనూరు, చెరుకుచెర్ల గ్రామాల్లో సాగు చేసిన పత్తి, వంగ, మిరప పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో పసుపు, నీలిరంగు జిగురు అట్టలను ఎకరాకు 25 చొప్పున ఏర్పాటు చేసుకోవాలని, గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఎకరాకు 20 చొప్పున ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మిరపలో నల్లతామర పురుగులు, యాజమాన్య పద్ధతులు, వంగ పంటను ఆశించే పురుగు, తెగుళ్ల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ పీరునాయక్ మాట్లాడుతూ కౌలు రైతులు కౌలు గుర్తింపుకార్డులు పొందాలని చెప్పారు.

ఆ ఫీల్డ్ అసిస్టెంట్ మాకొద్దు!

- పార్నపల్లె ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదుల వెల్లువ
- విచారణ చేసిన ఏపీడీ బాలాజీ నాయక్


ఉపాధి కూలీలతో మాట్లాడి వివరాలు సేకరిస్తున్న ఏపీడీ బాలాజీ నాయక్, సర్పంచ్, ఎంపీటీసీలు

మహానంది: ఆమె చెప్పిందే వినాలి, వారం రోజుల నుంచి ఊళ్లో పనులు చేపట్టడం లేదు, ప్రశ్నిస్తే దుర్భాషలాడుతుంది. ఆమె ఉంటే మేం పనులకు వెళ్లం, ఆ ఫీల్డ్ అసిస్టెంట్ మాకొద్దు సార్ అంటూ ఉపాధి కూలీలు నిరసన వ్యక్తం చేసిన సంఘటన శుక్రవారం బండిఆత్మకూరు మండలం పార్నపల్లెలో చోటు చేసుకుంది. అధికారులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు..పార్నపల్లెకు చెందిన పబ్బతి మల్లికాదేవి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా ఇటీవల ఆమెపై పలు ఆరోపణలు రావడంతో అధికారులు తొలగించారు. అయితే ఆమె హైకోర్టును ఆశ్రయించి ఈ నెల 17న తిరిగి విధుల్లో చేరింది. ఇదిలా ఉండగా సర్పంచ్ షేక్ షబ్బీర్ అహమ్మద్, ఉపాధి కూలీలు అదే రోజు ఆమెపై పలు ఫిర్యాదులు చేస్తూ పీడీకి వినతిపత్రం అందజేశారు. పీడీ ఆదేశాల మేరకు ఏపీడీ బాలాజీ నాయక్ గ్రామానికి చేరుకుని సర్పంచ్, ఎంపీటీసీ మల్లు శ్రీనివాసరెడ్డి, ఏపీఓ వసుధారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం వద్ద విచారణ చేపట్టారు. ఆమెపై వచ్చిన ఆరోపణల్లో కొన్నింటిని అధికారులు తెలిపారు. వాటిలో గ్రీన్ అంబాసిడర్ నరసింహులు, వీఓఏ శిరోమణి పనికి వెళ్లకున్నా హాజరు వేయడం, ప్రభుత్వ వేతనం అందుకుంటున్న వారికి పనులు కల్పించిందన్నారు. విధుల్లో చేరి తొమ్మిదిరోజులైనా పనులు కల్పించడం లేదని, పనికి వెళ్లకున్నా మస్టర్‌లో మా పేర్లు రాసుకుని, సంతకాలు తీసుకుని వేతనాలు వచ్చాక మేటీ ద్వారా తానే తీసుకుంటుందని పలువురు కూలీలు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ పనుల్లో 2020–21, 2021–22 ఏడాదిలో నాటిన మొక్కల పెంపకంలో కుటుంబ సభ్యుల పేర్లు రాసుకుని రూ.లక్షల్లో బిల్లులు తీసుకుందని ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. ఏపీడీ మాట్లాడుతూ ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, పీడీ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి

పగిద్యాల: మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమావేశంలో సభ్యులు చేసిన తీర్మానాలు నెరవేర్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆయా శాఖల అధికారులు అభివృద్ధి నివేదికలను చదివి వినిపించారు. నాడు నేడు పథకం కింద పగిడ్యాల, తూర్పు ప్రాతకోట గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాలకు మరమ్మతులు చేపట్టిన భూషిరెడ్డి పనులు పూర్తి చేయకుండా పెండింగ్ పెట్టాడని వైద్యాధికారులు మోహన్, కృష్ణమూర్తి సభ దృష్టికి తెచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 15 వర్క్‌లకు రూ. 24 లక్షలు మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్ పేర్కొన్నారు. ఇందులో రెండు పనులు పూర్తి కాగా 13 పనులు ప్రారంభం కాలేదన్నారు. పడమర ప్రాతకోటలోని జీఎల్ఎస్ఆర్ ట్యాంక్‌లకు కుళాయిలు లేక నీరు నిరుపయోగమవుతోందని, దీంతో ముస్లీం కాలనీకి నీళ్ల సరఫరా కావడం లేదని కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాషా ధ్వజమెత్తారు. స్పందించిన ఎంపీడీఓ వెంకటరమణ చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించకపోతే ఎందుకని సచివాలయ కార్యదర్శి ఇషాంబాషాపై మండిపడ్డారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు 2.10 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యం నిర్దేశించారని, ఇప్పటి వరకు 59,407 పనిదినాలు పూర్తయ్యాయని చెప్పారు. ఇప్పటి వరకు రూ.1.40 కోట్లు వేతనాలకు ఖర్చు చేయగా, మెటీరియల్‌కు రూ.16.50 లక్షలు చెల్లింపులు జరిగాయని తెలిపారు.రేషన్ పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని, నెల నెలా బియ్యం పంపిణీని సక్రమంగా చేయడం లేదని నెహ్రూనగర్ సర్పంచ్ రాజేశ్వరి తహసీల్దార్ భారతి దృష్టికి తెచ్చారు.స్పందించిన తహసీల్దార్ విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాత ముచ్చుమర్రి, పగిద్యాల గ్రామాల్లో డబల్ లైన్ బ్రిడ్జీలు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయని పదిహేను రోజుల్లో టెండర్‌లు పిలుస్తారని భారీ నీటిపారుదల శాఖ మండల ఏఈ నరేష్ వివరించారు. సంకిరేణిపల్లెలో పంట కాలువల మరమ్మతు పనులకు రూ.35 లక్షలు మంజూరయ్యాయని త్వరలోనే పనులు చేపడుతామని ఏఈ పేర్కొన్నారు. సీడీపీఓ కోటేశ్వరమ్మ, తహసీల్దార్ భారతీ, ఎంఈఓ సుభాన్, ఏఈలు, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు

పాములపాడు: మండలంలోని చెలిమిల్ల గ్రామంలో వెంకటక్షమ్మ అనే మహిళ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగి ఇంట్లోని నగదు, నిత్యావసర సరుకులు దగ్ధమైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. తాను కూలి పనికి వెళ్లిన సమయంలో సంఘటన జరిగిందన్నారు. ఇటీవల మేకలు అమ్మగా వచ్చిన నగదు రూ.1.20 లక్షలు ఇంట్లో ఉంచింది. మంటలు చెలరేగడంతో ఇంట్లోని నిత్యావసర సరుకులు, వస్తువులు నగదు కాలిబూడిదయ్యాయని వాపోయింది. మంటలు చెలరేగిన సమయంలో ఇంటి పక్కనున్న వారు గమనించి తలుపు పగులగొట్టి గ్యాస్‌సిలిండర్, టీవి బయటకు తెచ్చారు.

దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: పాడి రైతులు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకందారులు పశుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని పశుసంవర్థక శాఖ ఏడీ రామాంజనేయనాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న వైఎస్సార్ పశు నష్టపరిహారం పథకానికి చేర్పులు, మార్పులు చేసి కొత్తగా వైఎస్సార్ పశుబీమా పథకాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా పశుపోషకులకు గరిష్టంగా ఐదు గేదెలు, 50 గొర్రెలు లేదా మేకలు, లేదా పందులకు బీమా చేయించుకొనే అవకాశం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, తెల్లరేషన్ ఉన్న పశుపోషకులకు 20 శాతం లబ్ధిదారుని వాటాగా, ఆర్థికంగా స్థితివంతులైన వారికి 50 శాతంగా నిర్ణయించారని పేర్కొన్నారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులకు మూడేళ్లు, రెండేళ్లు, ఏడాది కాలపరిమితికి చెల్లించాల్సిన బీమా ప్రీమియం గురించి వివరించారు. వివరాలకు స్థానిక ఆర్బీకేలు, పశువుల ఆసుపత్రిలో సంప్రదించాలని సూచించారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం

మహానంది: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలని బండిఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్‌జా తెలిపారు. మండలంలోని శింగవరం, ఈర్నపాడు, పార్నపల్లె గ్రామాల్లో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించాలని, ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి వాటిని సంరక్షించాలని కోరారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి


శాతనకోటలో రైతులకు సోయాబీన్ విత్తనాలు అందజేస్తున్న దృశ్యం

నందికొట్కూరు: సోయాబీన్ పంట బెట్టను తట్టుకుని అధిక దిగుబడినిస్తుందని, ఇందుకు యాజమాన్య పద్ధతులు చేపట్టాలని యాగంటిపల్లి కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని శాతనకోట గ్రామంలో కృషి విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో 120 మంది రైతులకు సోయాబీన్ విత్తనాలు సర్పంచు జనార్దన్‌గౌడ్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ విత్తనాలు తీసుకున్న రైతులందరూ మట్టి పరీక్షలు చేయించుకోవాలని, వాటి ఫలితాల ఆధారంగా ఎరువులు, మందులు వినియోగిస్తే ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు ఖర్చు తగ్గించుకోవచ్చని చెప్పారు. శనగపంట కాకుండా ముందగా సోయాబీన్ సాగుచేస్తే అధిక ఆదాయం పొందగలరని సూచించారు. వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేయాలి


హౌసింగ్ పురోగతిపై సమీక్షిస్తున్న ప్రత్యేక అధికారి రఘురామయ్య

పగిద్యాల: నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో చేపట్టిన పక్కా గృహ నిర్మాణాల లక్ష్యాలని తప్పనిసరి పూర్తిచేయాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి రఘురామయ్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పడమర ప్రాతకోట, పగిద్యాల, నెహ్రూనగర్ గ్రామాల్లోని జగనన్న లే అవుట్ కాలనీలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఆయా గ్రామ సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్స్, ఇంజినీరింగ్, మహిళా పోలీస్, సచివాలయ కార్యదర్శులకు ఇచ్చిన లక్ష్యాలను వచ్చే బుధవారంలోపు పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణాల పురోగతిపై వారం వారం నివేదికలను అందజేయాలని, టార్గెట్‌లు పూర్తి చేయని వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. హౌసింగ్ డీఈ ప్రభాకర్, ఎంపీడీఓ వెంకటరమణ, హౌసింగ్ ఏఈ జ్యోతి, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, సమతయశోదర, జావేద్, వీరన్నయాదవ్, ఇషాం బాషా, మల్లికార్జున పాల్గొన్నారు.

అధ్యాపకుడికి అవార్డులు


గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ మల్లేశ్వర్‌రెడ్డి

మహానంది: చదివిన కాలేజీలోనే అధ్యాపకుడిగా పనిచేయడం ఓ విశేషమైతే, ప్రతిష్టాత్మకమైన రెండు అవార్డులు పొందడం మరో విశేషం. మహానంది ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాలలో అగ్రానమీ (సేద్యవిభాగం)లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎ.మల్లేశ్వరరెడ్డికి రెండు ప్రతిష్టాత్మక అవార్డులు లభించాయని ప్రిన్సిపాల్ డాక్టర్ కెఎస్ఎస్ నాయక్ శుక్రవారం తెలిపారు. మెట్ట వ్యవసాయంలో చేసిన పరిశోధనలకు ఉత్తమ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తగా ఒకటి, ఏజీ ఎంఎస్సీ అగ్రానమీలో వర్షపునీటిలో యాజమాన్యం, వేరుశనగ పంటలపై చేసిన పరిశోధనలకు యూనివర్శిటీ స్థాయిలో ఓజీపీ అత్యధికంగా రావడంతో ఎన్‌జీ రంగా యూనివర్శిటీ వారు గోల్డ్‌మెడల్‌తో సత్కరించిందని చెప్పారు. బాపట్లలో జరిగిన స్నాతకోత్సవాల్లో భాగంగా ఈ నెల 22న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ఐసీఏఆర్ మాజీ సెక్రటరీ డాక్టర్ ఆర్ఎస్ పరోడా, యూనివర్శిటీ వీసీ డాక్టర్ ఆదాల విష్ణువర్ధన్‌రెడ్డి అవార్డులు అందజేశారని వివరించారు. ఈ సందర్భంగా ఆయనను ప్రిన్సిపాల్‌తో పాటు, అధ్యాపకులు అభినందించారు.

30న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

జూపాడుబంగ్లా: మండలంలోని తరిగోపుల గ్రామంలోని సీఎస్ఐ చర్చి తొమ్మిదొవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి కర్నూలు జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు చర్చి సంఘం పెద్దలు తెలిపారు. శుక్రవారం వారు జూపాడుబంగ్లాలో విలేకరులతో మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈనెల 29వ తేదీ సాయంత్రం లోపు రూ.300 ప్రవేశరుసుము చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. విజేతలకు వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేల ప్రకారం నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు. వివరాలకు సెల్ 7702232280, 9573258151 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విద్యుత్ సమస్య పరిష్కరించరూ!

జూపాడుబంగ్లా: మండలంలోని 80బన్నూరులో ఫీడర్ సమస్యాత్మకంగా మారటంతో గంటకో మారు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటుండటంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 80బన్నూరు ఫీడర్ కింద తాటిపాడు, 80బన్నూరు, పోతులపాడు, చాబోలు, తరిగోపుల, కృష్ణరావుపేట గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల్లో సుమారు 6,500 మంది విద్యుత్ వినియోగదారులున్నారు. పదిహేను రోజుల నుంచి ఫీడర్ పరిధిలో రోజుకు పది మార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంటుందని ప్రజలు వాపోతున్నారు. వేసవి ఎండల తీవ్రత మండిపోతున్న నేపథ్యంలో వ్యవసాయ పనులకు వెళ్లొచ్చిన వారు విద్యుత్ సరఫరా లేక ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.